ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3 విజయనగరం

జిల్లా వార్తలు


గురువారం 2 మే 2024



మద్యం షాపులకు సీసీ కెమెరాలు

విజయనగరం క్రైమ్, మే 1: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 149 ప్రభుత్వ మద్యం షాపులు, 28 బార్ అండ్ రెస్టారెంట్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎన్‌వీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సరఫరా చేస్తున్న 40 వాహనాలకు కూడా జీపీఎస్ ఏర్పాటు చేశామన్నారు. మద్యం డిపోలో సీసీ కెమెరాలు కలెక్టర్ కార్యాలయంలోని ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌కు, మద్యం షాపులు, బార్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు విజయవాడలోని సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్, ఎన్నికల కమిషన్ కార్యాలయానికి అనుసంధానం అయినట్లు పేర్కొన్నారు.


జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం



అసలు వర్సిటీ స్థాయి ఉందా?

పేరు గొప్ప కాని గురజాడ విశ్వవిద్యాలయం ఎందులోనూ ఆ స్థాయి కనిపించడం లేదు. సాధారణ సౌకర్యాల నుంచి అధ్యాపకుల వేతనాల వరకూ.. విద్యార్థులకు మౌలిక సదుపాయాల నుంచి వారు తినే ఆహారం వరకూ.. అన్నీ కొరతే. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించేసి వదిలేసింది. కీలకంగా ఉండాల్సిన అధ్యాపకులను కూడా అరకొరగా నియమించారు. కాకినాడ జేఎన్‌టీయు నుంచి ధామాషా విధానంలో రావాల్సిన నిధులు రాలేదు. హాస్టల్‌లో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, మరుగుదొడ్లు బాగాలేవని కొద్దినెలల కిందటే విద్యార్థులు వర్సిటీ గేటు వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అయినా గాడిన పడలేదు. ఈ సంస్థ కళాశాలకు ఎక్కువ.. యూనివర్సిటీకి తక్కువ అంటూ విమర్శలు ఎదుర్కొంటోంది.

(విజయనగరం రూరల్)

- మౌలిక వసతులే లేని గురజాడ విశ్వ విద్యాలయం
- ఆర్భాటంగా ప్రకటించి వదిలేసిన వైనం
- కనీస సంఖ్యలో లేని అధ్యాపకులు
- కాకినాడ జేఎన్‌టీయూ నుంచి రాని దామాషా నిధులు
- విద్యార్థులకు సౌకర్యాలు కరువు
- అనేకసార్లు ఆందోళన
- అయినా పట్టని వర్సిటీ అధికారులు
- పైగా నిరసన తెలిపిన వారిపై కక్ష సాధింపు చర్యలు

వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా జెఎన్‌టీయు కళాశాలను విజయనగరంలో ఏర్పాటు చేశారు. జేఎస్‌టీయు కాకినాడకు అనుబంధ కళాశాలగా నడిచేది. జగన్ వచ్చాక 2022 జనవరి 12 న దీనిని కళాశాల నుంచి విశ్వవిద్యాలయంగా మార్చారు. అప్పటికే ఎన్నో సమస్యలు ఉన్నా.. వర్సిటీకి తగినట్టుగా మౌలిక వసతులూ లేకున్నా విశ్వవిద్యాలయంగా ప్రకటించేశారు. కాకినాడు జెఎన్‌టీయు నుంచి ధామాషా విధానంలో రావాల్సిన నిధులు రాలేదు. అనుబంధ కళాశాలల నుంచి రూ.20 కోట్ల బకాయిలు రాలేదు. ఇంజనీరింగు ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోవడం తదితర కారణాలతో 20 అనుబంధ కళాశాలలు మూతపడ్డాయి. వీటి నుంచి రావల్సిన రూ.10 కోట్లు వస్తాయో? రావో తెలియదు. దీనిపై యూనివర్సిటీ అధికారులు దృష్టి పెట్టడం లేదన్న అభిప్రాయం అందరిలో ఉంది. అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. యూనివర్సిటీ పరిధిలో వున్న విజయనగరం, కురుపాం ఇంజనీరింగ్ కళాశాలలకు దాదాపు 150 మంది అధ్యాపకులు అవసరం కాగా, కేవలం 22 మందే ఉన్నారు. మిగతా 132 అధ్యాపక పోస్టుల భర్తీ ఎప్పుడు చేపడ్తార్నది విద్యార్థులను వేధిస్తున్న ప్రశ్న. ఈ విధంగా నాణ్యమైన విద్య లేకపోవడంతో గత రెండేళ్లుగా జెఎన్‌టీయు గురజాడ విశ్వ విద్యాలయం నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూల్లో విజయం సాధించే వారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది.

- యూనివర్సిటీ స్థాయికి ఎదిగిన నేపథ్యంలో కొత్త భవనాల నిర్మాణానికి జాతీయ ఇంజనీరింగ్ కౌన్సిల్ (ఏఐటీసీ), జేఎన్‌టీయు- కాకినాడ నుంచి రూ.24 కోట్ల 94 లక్షలు విడుదలయ్యాయి. ఈ నిధులతో అకడమిక్ బ్లాక్-3, (అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్), బాలికల వసతి గృహం, మెటలార్జికల్ ఇంజనీరింగు, సివిల్ ఇంజనీరింగు భవనాల విస్తరణతో పాటు తాగునీటి ట్యాంకు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కానీ పూర్తికాలేదు. ప్రతిపాదించిన పనుల్లో రెండు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. మిగతావి నిర్మాణం ముందుకు సాగడం లేదు. నిర్దేశించిన సమయం దాటిపోతుండడంతో అంచనా వ్యయం పెరుగుతోంది. ఇ-టెండర్ల ప్రక్రియ కొలిక్కి రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి.


హాస్టల్‌లో సమస్యలపై నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు(ఫైల్)

మౌలిక వసతులేవీ?

మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తమ, తమ ఎన్నికల ప్రసంగాల్లో జెఎన్‌టీయు గురజాడ విశ్వవిద్యాలయం గురించి మాట్లాడుతూ ఉన్నారు. ఈ విశ్వవిద్యాలయాన్ని ఎన్నో విధాలుగా ప్రభుత్వం అభివృద్ధి చేసిందని చెబుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితికి, వారి మాటలకు పొంతనే లేదు. యూనివర్సిటీ క్యాంపస్‌లో కనీస సౌకర్యాలు లేవు. లైటింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. హాస్టల్‌లో మరుగుదొడ్లు బాగాలేవని కొద్దినెలల కిందటే విద్యార్థులు వర్సిటీ గేటు వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. లైబ్రరీలో ఇంటర్నేట్ సౌకర్యం అంతంతమాత్రం. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతూ విద్యార్థులు నిరసన తెలిపారు. వసతి గృహంలో నాణ్యమైన భోజనం పెట్టని కారణంగా హాస్టల్ విద్యార్థులు కొందరు ఓ రోజు ఆస్పత్రిని ఆశ్రయించాల్సి వచ్చింది. యూనివర్సిటీలో సమస్యలపై ఎప్పటికప్పుడు విద్యార్థులు ప్రజా సంఘాల దృష్టికి తీసుకువెళ్తూనే ఉన్నారు. దీనిపై స్పందించాల్సింది పోయి యూనివర్సిటీ అధికారులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి థియరీ, ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ చేయించారు. యూనివర్సిటీలో ప్రజాస్వామ్యయుత నిరసనకు అవకాశం లేదన్న సంకేతాలు పంపారు. దీంతో విద్యార్థులు యూనివర్సిటీలో పరిస్థితిపై లబోదిబోమంటున్నారు. ఇదే విషయమై విద్యార్థులకు సహకరించారన్న అభిప్రాయంతో యూనివర్సిటీలోని కొంత మంది ప్రొఫెసర్లపైనా కీలక అధికారి కక్ష సాధిస్తున్నారని సమాచారం.

తరచూ అందని జీతాలు..

జెఎన్‌టీయు విశ్వవిద్యాలయంలో పనిచేసే సిబ్బందికి తరచుగా జీతాల సమస్య ఏర్పడుతోంది. విద్యాలయం ఉపకులపతి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మొత్తం 210 మంది పనిచేస్తున్నారు. వీరిలో కేవలం ఎనిమిది మందికి మాత్రమే జెఎన్‌టీయు కాకినాడ జీతాలు చెల్లిస్తోంది. మిగిలిన 202 మందిలో 74 మంది సీఎంఎఫ్ఎస్ నుంచి జీతాలు వస్తాయి. వీరి బడ్జెట్ దాదాపు రూ.50 లక్షలు.. వీరి విషయంలో ప్రతి నెలా రిజిస్ట్రార్ బిల్లులను ఆన్‌లైన్‌లో పెట్టాలి. వీరికి ప్రతి నెల 25 నుంచి 30వ తేదీలోపున జీతాలు పడతాయి. మిగిలిన బోధనేతర సిబ్బంది, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగు, సెక్యూరిటీకి సంబంధించి విద్యాలయం నిధుల నుంచి చెల్లిస్తారు. అయితే ఎవరికీ సకాలంలో జీతాలు అందడం లేదు. ఏ విభాగం వారికి ఎప్పుడు అందుతాయో తెలియదు. ఇలా జెఎన్‌టీయు విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెంది రెండేళ్లు దాటినా ఇంకా బాలారిష్టాలు దాటలేదు.

మల..మల.. మాడిపోయారు




మండుటెండలో సిద్ధం సభ జరుగుతుండగా వెనుతిరిగిన జనం

- సీఎం జగన్ సిద్ధం సభలో జనానికి ఇక్కట్లు
- సొమ్మసిల్లిపడిపోయిన మహిళలు, వృద్ధులు
- అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలింపు
- ఇంటికి వెళ్లిపోతామన్నా వదలని పోలీసులు
- బొబ్బిలి మెయిన్ రోడ్లు, జంక్షన్లన్నీ దిగ్బంధం

బొబ్బిలి/ తెర్లాం, మే 1: సీఎం జగన్ ఎక్కడికి వెళ్తే అక్కడ జనానికి నరకమే అన్న నానుడి బొబ్బిలిలో స్పష్టంగా కనిపించింది. నాయకులు, వలంటీర్లు ఒత్తిడి చేయడంతో చేసేది లేక జగన్ సభకు వెళ్లిన మహిళలు, వృద్ధులు బుధవారం నరకం చూశారు. ఎండ వేడికి తాళలేక చాలా మంది సొమ్మసిల్లిపడి పోయారు. కొందరిని 108లో ఆస్పత్రికి తరలించారు. సభ నుంచి ఇంటికి వెళ్లిపోతామని పోలీసులను బతిమలాడినా వదలని దృశ్యాలు కనిపించాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం బొబ్బిలి పట్టణంలోని బలిజిపేట రోడ్డులో రాజుగారికోటకు సమీపంలో జగన్ సభ జరిగింది. ఉదయం పది గంటలకు సీఎం సభ ఉంటుందని చెప్పి అన్ని గ్రామాల నుంచి ఆటోలు, ఇతర వాహనాల్లో జనాలను తరలించారు. మధ్యాహ్నం 12 గంటలు దాటిన తరువాత సీఎం వచ్చారు. అంత వరకు మండుటెండలో విలవిల్లాడిపోయారు. మధ్యలో బయటకు వచ్చేస్తామంటే పోలీసులు వెళ్లనీయలేదు. ఎంతో మంది మహిళలు, వృద్ధులు వడదెబ్బ తగిలి సొమ్మసిల్లిపోయారు. సీఎం సభ ముగిసిన తరువాత 108 అంబులెన్స్‌లు వచ్చి సొమ్మసిల్లిన వారిని ఆసుపత్రికి తరలించాయి. అంతవరకు తోటి జనమే వారికి సపర్యలు చేశారు.

- రెండు రోజుల ముందు నుంచే పట్టణంలోని అనేక ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పగలు, రాత్రి విద్యుత్ లేకపోవడంతో వృద్ధులు, రోగులు, చిన్నారులు నానా అవస్థలు పడ్డారు. సీఎం కాన్వాయ్ వెళ్లే రహదారి పొడవునా వ్యాపార సంస్థలన్నింటినీ మూసివేయించారు.
- సీఎం సభకోసం వచ్చిన వైసీపీ కార్యకర్తలు ఆ మార్గంలో వెళుతున్న టీడీపీ ప్రచార వాహనాలను ఆసక్తిగా తిలకించడమే కాక విక్టరీ సింబల్ చూపి ప్రచార కర్తలను అభినందించడం గమనార్హం.
- సభకు వచ్చిన వారు ఎప్పటిలాగనే మద్యం షాపుల ముందు బారులుతీరి ఎంచక్కా జగన్ బ్రాండ్‌ను సేవించడం కనిపించింది.
- అన్ని కూడళ్లలో పెద్దఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో నాలుగైదు అడుగుల దూరంలో ఉన్న స్వగృహాలకు కూడా స్థానికులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చింది.
- జెండా వీధి జంక్షన్‌లో నాలుగువక్కలా పోలీసులు బారికేడ్లు వేయడంతో మహిళలు వెళ్లేదారిలేక కన్నీటిపర్యంతమయ్యారు. మధ్యాహ్నం 12 అవుతోందని, మా పిల్లలకు భోజనం పెట్టాలని, వారు ఏడుస్తారని, మమ్మల్ని వదిలేయండి అని మహిళలు ప్రాథేయపడినా పోలీసులు కనికరించలేదు.
- జగన్ మాటలు ఒక్క ముక్క వినపడలేదని, పైనుంచి ఎండలు, ఉక్కబోత, చెమట్లు పట్టి ఉన్నామని, ఎందుకోసం రప్పించారో తెలియదని పలువురు గగ్గోలు పెట్టారు. ఈ సమస్యను సీఎం జగన్‌కు బస్సుపై ఉన్న మంత్రి బొత్స సత్యనారాయణ, చిన్నశీనులు చెప్పారు. బారికేడ్ల నుంచి ప్రజలను బస్సు వరకు రోప్‌పార్టీతో అనుమతించాలని ఎస్‌పిని కోరారు. అయినా సీఎం బస్సు సమీపానికి ఎవరినీ అనుమతించేది లేదని పోలీసులు చెప్పడంతో వైసీపీ నాయకులు జనానికి ముఖం చాటేయకతప్పలేదు.


కర్ఫ్యూ కానే కాదు.. సిద్ధం సభ ఎఫెక్ట్

బొబ్బిలి ప్రధాన రహదారిని బ్లాక్ చేయడంతో వెలవెలబోతున్న దృశ్యం

ఇలా.. ఇలా.. ఇలా

- విసిగించిన సీఎం జగన్ ప్రసంగం
- చంద్రబాబుపై విమర్శలు చేస్తూ గాలిలో చేతులు

ఊపాలని పిలుపు

బొబ్బిలి, మే 1: బొబ్బిలి పట్టణంలో సీఎం జగన్ బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభ జనాలను ఏ మాత్రం ఆకట్టుకోలేకపోయింది. బిగ్గరగా గొంతెత్తి అరవడంతో సీఎం ఏమి చెబుతున్నారో ప్రజలకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆయన ప్రసంగం సాగిన తీరు ఇలా ఉంది. బొబ్బిలీ...అని పిలిచి సిద్ధమా...అని చాలా బిగ్గరగా అడిగారు. మీ బిడ్డ 59 నెలల పాలనలో విప్లవాలు సృష్టించాడని చెప్పుకొచ్చారు. చంద్రబాబు వస్తే పథకాలన్నీ రద్దవుతాయన్నారు. ఎన్నో పథకాలు అమలు చేస్తున్న తానే కదా లీడర్ అంటూ జనాన్ని అడిగారు. పథకాలన్నింటినీ మళ్లీ మళ్లీ వల్లెవేసి ఆలోచన చేయండని కోరారు. చంద్రబాబు హయాంలో ఏమీ జరగలేదని చెబుతూ ఇలా... ఇలా... ఇలా... అని చేయి ఊపండి అంటూ జగన్ సభలో చేసి చూపించారు. పదే పదే సీఎం పెద్ద గొంతుతో ఇలా అనడం గమనార్హం. 2014 లో కూటమి తరపున ఇచ్చిన మేనిఫెస్టోను గుర్తుకు తెచ్చుకోండి అంటూ ఆ మేనిఫెస్టో పత్రాన్ని ప్రదర్శించారు. ఇప్పుడేమో సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటున్నారని ఎద్దేవా చేశారు. 175 ఎమ్మెల్యే స్థానాలు, 25 ఎంపీలను గెలిపించండి. ఒక్కటీ కూడా తగ్గేది లేదు అంటూ జనాలకు సీలింగ్ ఫ్యాన్‌ను చూపించారు. సీఎం వెంట మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బెల్లాన చంద్రశేఖర్, శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు, సీనియర్ నేత తూముల భాస్కరరావు తదితరులు ఉన్నారు.



నేడు జిల్లాకు బాలకృష్ణ

చీపురుపల్లి, విజయనగరంలో ఎన్నికల ప్రచారం

విజయనగరం, మే 1(ఆంధ్రజ్యోతి)/ చీపురుపల్లి: ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జిల్లా పర్యటనకు వస్తున్నారు. తొలుత చీపురుపల్లి నియోజకవర్గ కేంద్రానికి గురువారం చేరుకుంటారు. ఇదే రోజు సాయంత్రం విజయనగరంలో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. గంటస్తంభం కూడలిలో రోడ్డు షో ఉంటుంది. చీపురుపల్లిలో సాయంత్రం 4గంటల వరకు ప్రచారం కొనసాగించి ఆపై విజయనగరం చేరుకుంటారు. టీడీపీ శ్రేణులు విజయగనరంలోని నీళ్ల ట్యాంక్ వద్ద బాలకృష్ణకు స్వాగతం పలకనున్నాయి. నీళ్లట్యాంక్, కొత్తపేట, అంబటి సత్రం కూడలి, మూడు లాంతర్ల రోడ్డు మీదుగా గంట స్తంభం కూడలికి చేరుకుంటారు. రోడ్ షోలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు, ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా పాల్గొంటారు.

రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్

కలెక్టరేట్, మే 1: రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా బుధవారం పూర్తి చేశారు. తద్వారా ఆయ పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను కేటాయించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్, ఇక్బాల్ రోహిలా, సీతారాం జాట్ సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఎన్ఐసీ కేంద్రంలో బుధవారం ఈ ప్రక్రియ నిర్వహించారు. కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజక వర్గాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను ఎంపిక చేశారు. నియోజకవర్గాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి రిజర్వు చేసుకునేలా అదనంగా 20 శాతం బ్యాలెట్ యూనిట్లు, 20 శాతం కంట్రోల్ యూనిట్లు, 30 శాతం వీవీ ప్యాట్లను కేటాయించారు. పార్లమెంట్ ఎన్నికలకు కూడా దాదాపు అంతే సంఖ్యలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు కేటాయించారు. విశాఖ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంపికి పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండటంతో 972 బ్యాలెట్ యూనిట్లను కేటాయించారు.

పీపుల్స్ మేనిఫెస్టో

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



సాలూరు రూరల్: వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. కొందరిని మాత్రమే ఇటీవల రెగ్యులర్ చేశారు. ఎప్పటి నుంచో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న చాలా మందికి నిరాశ ఎదురయ్యింది. ఎన్నికల అనంతరం ఏ ప్రభుత్వం వచ్చినా కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. ఉద్యోగ భద్రత లేకపోవడంతో భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దృష్టిసారించాలి.

- ఎం.శేఖర్, కాంట్రాక్ట్ ఉద్యోగి, మామిడిపల్లి

బూత్ కాప్చరింగ్‌కు పాల్పడ్డారో జైలే

మీకు తెలుసా?



విజయనగరం: ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాన్ని స్వాధీనం చేసుకోవడం, అధికారులను బెదిరించి బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలు స్వాధీనం చేసుకోవడాన్ని బూత్ కాప్చరింగ్ అంటారు. ఎవరైనా కావాలని బ్యాలెట్ పేపర్లు, ఈవీఎంలను పాడు చేయడం, విరగ గొట్టడం ఎన్నికల గుర్తులపై సిరా పోయడం వంటివి ఇందులో భాగమే. పోలింగ్ కేంద్రంలో ఓటర్లను భయపెట్టడం, పోలింగ్ అడ్డుకోవడం నేరం. ఇలాచేసే ప్రభుత్వ సిబ్బంది అయితే ఐసీసీ 1951 సెక్షన్ 135 ఏ, 136 ప్రకారం మూడు నుంచి ఐదు సంవత్సరాలు జైలుతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. ఇతరులైతే ఒకటి నుంచి మూడు సంవత్సరాల జైలు శిక్ష వేస్తారు.

మంచోళ్లకు ఓటు వేసేవాళ్లం

పెద్దల మాట



భోగాపురం: అప్పట్లో మంచోళ్లకు ఓటు వేసేవాళ్లం. గతంలో బంధుత్వాలతో పిలుస్తూ చెట్ల కింద, రచ్చబండల వద్ద గుంపుగా కూర్చోబెట్టి... పెద్దోళ్లు వచ్చి ఓటు వేయాలని అడిగేవారు. ఇప్పుడు నాయకులు చెబుతున్న విధంగా జరగడం లేదు. అలాగే ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికే ఓటు వేస్తున్నారు. గతంలో కాగితాలపై ముద్ర గుద్ది ఆ కాగితాన్ని మడిచి డబ్బాల్లో వేసేవారిమి. ఇప్పుడు బటన్ నొక్కి ఓటేయాలంటున్నారు. ఏది నొక్కుతామో మాకేటి తెలుస్తుంది.? నాకు చంద్రబాబు అంటే ఇష్టం. మా గ్రామంలో నలుగురూ (అందరూ) దేనికి వేస్తే నేను దానికే ఓటు వేస్తాను. నాయకుడు ఉపయోగపడే విధంగా ఉండాలి.

- లక్కోజు చిన్నమ్మడు (75), ఎ.రాయవలస, భోగాపురం మండలం

● సకుటుంబ సపరివార సమేతంగా జనంలోకి ● తలోదిక్కుకు పరుగులు తీస్తున్న అభ్యర్థులు, బంధువులు

పదండి పోదాం ప్రచారానికి..

... శృంగవరపుకోట శాసనసభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరుపున నాలుగోసారి పోటీ చేస్తున్న కోళ్ల లలిత కుమారిని గెలిపించేందుకు భర్త బుచ్చి అప్పల రామప్రసాద్, కుమార్తె హసితనాయుడు, చెల్లెలు ఉష తదితర కుటుంబ సభ్యులంతా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఇంటింటికి తిరిగేస్తున్నారు. కనిపించిన వారందరినీ ఓట్లడుగుతున్నారు. తమ కుటుంబానికి ఉన్న రాజకీయ చరిత్రను వివరిస్తున్నారు.

... వైసీపీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు భార్య డాక్టర్ మధు ఎన్నికల ప్రచార రంగంలోకి దూకారు. తన భర్తను గెలిపించుకోనేందుకు అమెరికా నుంచి ఇక్కడ వాలిపోయారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ కడుబండిని గెలిపించాలని కోరుతున్నారు.

(శృంగవరపుకోట)

...ఇలా జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీతో పాటు ఇతర పార్టీల అభ్యర్థుల కుటుంబ సభ్యులు సపరివార సమేతంగా ఎన్నికల ప్రచారాల్లో మునిగి తేలుతున్నారు. నామినేషన్ల ఉప సంహరణ ఘట్టం ముగిసింది. సార్వత్రిక ఎన్నికల రణరంగంలో పోటీపడే అభ్యర్థులు ఎవరో తేలిపోయింది. బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటించారు. జిల్లాలో ఏడు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. 77 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. విజయనగరం పార్లమెంటు నియోజకవర్గంలోనూ 15 మంది అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ఆరు విజయనగరం పార్లమెంటు స్థానం పరిధిలోకి వస్తాయి. శృంగవరపుకోట మాత్రం విశాఖపట్నం పార్లమెంటు స్థానం పరిధిలోకి వస్తుంది. ఇక్కడ వచ్చే మెజార్టీని బట్టి విశాఖ పార్లమెంటు అభ్యర్థి గెలుపు... ఓటములు ఆధారపడి ఉంటాయి. దీంతో టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్, వైసీపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీలు ప్రత్యేకంగా ఈ నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. కుటుంబ సభ్యులను కూడా ప్రచారానికి పంపిస్తున్నారు. ఇప్పటికే టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ పెద్దమ్మ నాగిని నియోజకవర్గంలో ఉంటూ.. కార్యకర్తలతో కలసి తిరుగుతున్నారు. జాతీయ కాంగ్రెస్, బహుజన సమాజ్‌వాదీ, జాతీయ జనసేన, స్వతంత్ర అభ్యర్థులు ఇలా అనేక మంది బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా అన్ని నియోజకవర్గాల్లోనూ తెలుగుదేశం, వైసీపీల మధ్యే పోటీ ఉంది. ఈ రెండు పార్టీల అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించకముందు నుంచి సుడిగాలి ప్రచారానికి తెరలేపారు. పోలింగ్‌కు మరో 13 రోజులే సమయం ఉంది. ఇందులో ప్రచారానికి పది రోజులే మిగిలింది. ఇంత తక్కువ సమయంలో ఎక్కువ మందిని కలవడం కుదరదు. కుటుంబ సభ్యులంతా ప్రచారం చేయడం వల్ల వృద్ధులు, మహిళలు, యువత ఓట్లను కొల్లగొట్టడానికి ఆస్కారం ఉంటుందని అభ్యర్థులు భావిస్తున్నారు. అందుకే ఇంటిల్లిపాదీ ప్రచారంలో పాల్గొంటున్నారు. విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ పెద్దమ్మ శ్రీనాగిని ఎస్.కోటలో ఉంటే.. చిన్నమ్మ శ్రీవాణి విశాఖపట్టణంలో వయోభారాన్ని లెక్క చేయకుండా ప్రచారం చేస్తున్నారు. దీంతో పాటు అభ్యర్థుల పిల్లలు సాంకేతికంగానూ సహకారం అందిస్తున్నారు. అసంతృప్తులను బుజ్జగించే బాధ్యత తీసుకుంటున్నారు. తద్వారా వారు కూడా ప్రచారంలో భాగస్వాములయ్యేలా జాగ్రత్త పడుతున్నారు.





కానరాని నోట్ల దండలు

(రాజాం రూరల్)

గతానికి భిన్నంగా ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఎన్నికలలో పోటీ చేయాలంటే డబ్బే ప్రధానం. గతంలో నిజాయితీపరులు, స్వాతంత్ర్య సమరయోధులు ఎన్నికలలో నిలిస్తే.. ప్రజలే వారికి నోట్ల కట్టల దండలు వేసేవారు. అది అభినందనే కాదు... ఒకవిధంగా ఆర్థిక సాయం కూడా. ఇది అభ్యర్థులకు గౌరవంగానూ.. అదే సమయంలో ప్రజలలో తనపట్ల ఎలాంటి అభిప్రాయం ఉండేదో తెలియజేసేది. నాయకుల్లో సేవాతత్పరత ఉండేది. నాటి రోజుల్లో మద్యం ప్రభావం అంతంతమాత్రంగానే ఉండేది. మద్యం తాగే వారు గ్రామంలో ఒకరో, ఇద్దరో ఉండేవారు. ప్రస్తుతం తాగని వారి సంఖ్య ఆవిధంగా ఉందన్నా ఆశ్చర్యమే. గతంలో నాయకులకు, ఓటర్లకు నైతిక విలువలు ఉండేవి. ప్రస్తుతం డబ్బు విపరీతంగా ఖర్చుచేసి.. ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతులిస్తూ కొంతమంది నాయకులు గెలుస్తున్నారు. ఓటర్లు సైతం నిజాయతీకి మంగళం పాడి ఏ పార్టీ అభ్యర్థి ఇచ్చినా తీసుకుంటూ తమకు నచ్చిన వారికి ఓటేస్తున్నారు. విపరీతంగా డబ్బు ఖర్చు చేసి గెలిచాక తిరిగి దానిని కూడబెట్టుకునే పనిలో నాయకులు నిమగ్నమై... అభివృద్ధికి మంగళం పాడుతున్నారు. ప్రజా ప్రయోజనాలను గాలికి వదిలేస్తున్నారు. డబ్బు తీసుకుని ఓటేసిన ఓటర్లు సైతం నాయకుడిని ప్రశ్నించలేక... గ్రామాలకు వచ్చినపుడు సమస్యలపై నిలదీయలేక మౌనం వహిస్తున్నారు. ఫలితంగా అభివృద్ధి కుంటుపడుతోంది. ఆనాటి నోట్ల దండలు... నాటి నిస్వార్థ నాయకులు మళ్లీ కనిపించాలి.



ఎన్నికల సిబ్బందికి ఇచ్చేది అంతంతే!

● ఐదేళ్ల క్రితం ఇచ్చిందే.. ఇప్పుడు కూడా ● పెంచాలని కోరుతున్న ఉద్యోగులు

(గరుగుబిల్లి)


ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బందికి గత ఎన్నికలకు చెల్లించిన నామమాత్రపు రెమ్యునరేషన్ ఇప్పుడు కూడా చెల్లించనున్నారు. 2019 సాధారణ ఎన్నికలకు నియమితులైన అధికారులు, సిబ్బందికి చెల్లించాల్సిన రెమ్యునరేషన్ మొత్తాన్నే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల విధులకు నియమితులైన వారికి చెల్లించనున్నారు. అంటే ఐదేళ్ల క్రితం చెల్లించిన మొత్తమే ప్రస్తుతం కూడా చెల్లిస్తారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ గత నెల 27న ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల విధులకు సెక్టార్ ఆఫీసర్లు కాకుండా అదనంగా నియమితులయ్యే జోనల్ మేజిస్ట్రేట్‌కు ఏక మొత్తంగా రూ.1500 చెల్లిస్తారు.

ఉద్యోగుల పెదవి విరుపు

ఎంతో కష్టతరమైన పోలింగ్ విధులకు నియమితులైన ఉద్యోగులకు నామమాత్రపు రెమ్యునరేషన్ చెల్లింపునకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. 40 నుంచి 50 కిలోమీటర్ల దూరం వెళ్లి విధులు నిర్వహించి రావాలంటే కనీసం రూ.వెయ్యి ఖర్చు అవుతుంది. ఎంఈవోలు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, బ్యాంకు మేనేజర్లను పీవో, ఏపీవోలుగా నియమించారు. సిబ్బంది రెమ్యూనరేషన్ విషయంలో ఎన్నికల కమిషన్ పునరాలోచించి రెమ్యునరేషన్ పెంచుతూ తాజా ఉత్తర్వులు సవరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఇలా చెల్లిస్తారు

- సెక్టోరల్ ఆఫీసర్లకు రూ.5 వేలు, మాస్టర్ ట్రైనర్‌కు రూ.2 వేలు, అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్‌కు రూ.7500 ఏకమొత్తంగా చెల్లిస్తారు.
- వీడియో సర్వేలెన్స్ టీమ్‌కు ఏక మొత్తంగా రూ. 1200
- వీడియో వ్యూయింగ్ టీమ్, అకౌంటింగ్ టీమ్‌కు ఏక మొత్తంగా రూ. 1000
- ఆదాయ పన్ను ఇన్‌స్పెక్టర్‌కు ఏకమొత్తంగా రూ.1200
- మైక్రో అబ్జర్వర్‌కు ఏక మొత్తంగా రూ. 100
- కంట్రోల్ రూమ్, కాల్ సెంటర్ స్టాఫ్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీకి రోజుకు రూ. 200
- ప్రిసైడింగ్ ఆఫీసర్ అండ్ కౌంటింగ్ సూపర్‌వైజర్‌కు రోజుకు రూ.350
- నాలుగో తరగతి ఉద్యోగులకు రోజుకు రూ.200
- పోలింగ్ విధులకు నియమితులయ్యే వారికి పోలింగ్ రోజున స్నాక్, లంచ్, రిఫ్రెష్‌మెంట్‌కు రూ.150 చెల్లిస్తారు.
- పోలీసు సిబ్బందికి, మొబైల్ పార్టీ సిబ్బందికి, హోంగార్డులకు, ఫారెస్టు గార్డులకు, గ్రామ రక్షక దళ, ఎన్‌సీసీ క్యాడెట్లకు, మాజీ సైనిక ఉద్యోగులు, స్నాక్ లంచ్ లేదా రూ.150 నగదు చెల్లిస్తారు.
- ఎన్నికల్లో పోలింగ్ విధులకు, ఓట్ల లెక్కింపు విధులకు నియమితులైన వారికి రెమ్యునరేషన్‌తో పాటు భోజనానికి రూ.150 చెల్లిస్తారు. అర్హత మేరకు డీఏ చెల్లిస్తారు.



ఈ ఓట్ల కథ తెలుసా?



(సాలూరు రూరల్)

ఓటు వజ్రాయుధం. ప్రజాస్వామ్య మనుగడను శాసించేది ఓటు. భారత ప్రభుత్వం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కుల, మత, లింగ బేధం లేకుండా ఓటు హక్కును కల్పించింది. ఈ ఓటును వివిధ రకాలుగా ఎన్నికల్లో వేసి తమకు నచ్చిన వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటారు. ఒక్కో ఓటుకు ఒక్కో ప్రత్యేకత ఉంది.

సాధారణ ఓటు

18 ఏళ్లు నిండిన భారత పౌరుడు ఓటును కలిగి ఉంటాడు. ఫారం-6ను పూర్తి చేసి ఆధార్, రేషన్ కార్డు, నివాస ధ్రువపత్రాలు చూపిస్తే ఓటు హక్కు లభిస్తుంది. దీనిని సాధారణ ఓటు అంటారు. సాధారణ ఓటు పోలింగ్ రోజున ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి వేస్తారు. అత్యధికులు ఇదే పద్ధతిలో ఓటు వినియోగించుకుంటారు.

పోస్టల్ బ్యాలెట్

ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు సాధారణ ఓటర్లయి ఉంటారు. వారిని ఎన్నికల విధులకు నియమిస్తే పోలింగ్ రోజు తమ ప్రాంతంలో ఓటు వేసే అవకాశం ఉండదు. అందువల్ల వారు ముందస్తుగానే ఫారం-12 నింపి తమ ఎన్నికల ఆదేశాలు, ఆధార్ జిరాక్స్‌లతో కలిపి తాము పనిచేసే చోట ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేస్తారు. వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటు అందిస్తారు. గతంలో పోస్టు ద్వారా పంపించే వారు. ప్రస్తుత ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగానికి నియోజకవర్గాల వారీగా ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

- పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ నియోజకవర్గ ప్రధాన కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులకు నియమితులైన ఉద్యోగులు ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల్లోగా తమకు తీరిక ఉన్న సమయంలో వచ్చి ఓటు వేయాల్సి ఉంటుంది. గెలుపోటములను పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పలుసార్లు ప్రభావితం చేశాయి.

ఎన్ఆర్ఐకి ఓటు

విదేశాల్లో ఉన్న నాన్ రెసిడెంట్ ఇండియన్స్‌కు ఓటు హక్కును కల్పించారు. ఆన్‌లైన్‌లో ఫారం-6ను నింపి.. తగిన ఆధారాలు చూపిస్తే ఎన్ఆర్ఐలకు ఓటుహక్కు కల్పిస్తారు. తమ ఆసక్తి మేరకు విదేశాల నుంచి పోలింగ్ రోజున వచ్చి ఓటు వేయవచ్చు.

టెండర్ ఓటు

ఇది ప్రత్యేకమైన ఓటు. ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి ఓటు అప్పటికే ఎవరో వేసి ఉంటే ఈ ఓటును నిబంధనల ప్రకారం ప్రిసైడింగ్ ఆఫీసర్ జారీ చేస్తారు. తాను రాకుండానే ఎవరో ఓటు వేశారని నిరూపించుకోవాలి. దీంతో పీవో టెండర్ ఓటును ఇస్తారు. టెండర్ ఓటు ఈవీఎంలో వేయడానికి వీలులేదు. బ్యాలెట్ అందిస్తారు. బ్యాలెట్‌లో ఓటు వేసిన తరువాత పీవోకు అందించాల్సి ఉంటుంది. దానిపై పీవో సంతకం చేస్తారు. దానిని ఫారం 17 (బి), 17 (సీ)లో నమోదు చేస్తారు. దానిని ప్రత్యేకమైన కవర్‌లో పెట్టి సీల్ చేస్తారు. లెక్కింపులో పరిస్థితిని బట్టి దానిని పరిగణనలోకి తీసుకుంటారు.

ప్రాక్సీ ఓటు ఫర్ సీఎస్‌వీ

దేశభద్రత విధుల్లో ఉన్న సైనికుల కోసం ప్రత్యేకంగా ప్రాక్సీ ఓటు విధానం ఏర్పాటు చేశారు. సైన్యంలో విధులు నిర్వహించే వారు ఓటు వేయడానికి రాలేని పరిస్థితి ఉంటుంది. అందువల్ల వారికి క్లాసిఫైడ్ సర్వీస్ ఓటు అందిస్తారు. వారి తరపున సీఎస్‌వీ అనుమతి పొందిన వ్యక్తి వచ్చి పోలింగ్ బూత్‌లో ఓటు వేయవచ్చు. అలా క్లాసిఫైడ్ సర్వీస్ ఓటరు తరపున ఓటు వేయడానికి వచ్చిన వారిని ప్రాక్సీ ఓటరు అని... అతని ఓటును ప్రాక్సీ ఓటు అని అంటారు.

చాలెంజ్ ఓటు

ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తిని అతను నిజమైన ఓటరు కాదని పోలింగ్ ఏజెంట్ అభ్యంతరం చెప్పి చాలెంజ్ చేస్తారు. పోలింగ్ ఏజెంట్ వద్ద రూ.2 ఫీజు కట్టించుకుంటారు. పోలిం గ్ ఏజెంట్, వచ్చిన వ్యక్తి వాదనలు విన్న పీవో గుర్తింపు కోసం బీఎల్వో, ఇతర ఓటర్ల ద్వారా నిజమైన ఓటరా కాదా అని నిర్ధారించుకుంటారు. నిజమైన వ్యక్తి అయితే ఓటింగ్‌కు అనుమతిస్తారు. కాకుంటే పోలీసులకు అప్పగించి పోలింగ్ ఏజెంట్ కట్టిన ఫీజు అతనికి తిరిగిస్తారు. చాలెంజ్డ్ ఓటు వేసిన వ్యక్తి వివరాలు ఫారం -14లో నమోదు చేస్తారు.

ఇంటి నుంచి ఓటు

85 ఏళ్లు దాటిన వృద్ధులకు.. దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. నిబంధనల మేరకు ఇళ్ల దగ్గర వీరంతా ఓటు వేయాల్సి ఉంటుంది.



చీపురుపల్లిలో గెలిస్తే

అధికారమే!



చీపురుపల్లి పట్టణం

● యాభై ఏళ్లుగా కొనసాగుతున్న సెంటిమెంట్



త్రిపురాన వెంకటరత్నం

(చీపురుపల్లి)

చీపురుపల్లి నియోజకవర్గం ఉత్తరాంధ్రలో హాట్ సీట్‌గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం రెండు ప్రధాన పార్టీల నుంచి ఇద్దరు రాజకీయ ఉద్దండులు బొత్స సత్యనారాయణ, కిమిడి కళా వెంకటరావు తలపడుతున్నారు. ఈ నియోజవర్గ చరిత్రలో మరో ప్రధాన అంశం కూడా ఉంది. ఇక్కడ గెలుపొందిన పార్టీకి రాష్ట్రంలో అధికారం దక్కుతుందన్న విశ్వాసం కూడా బలంగా ఉంది. ఇది ఒట్టి మాట కాదని గతంలో వెల్లడైన ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి. దీని కారణంగానే ప్రతిసారీ అసెంబ్లీ ఎన్నికలు మరింత ఆసక్తిగా మారుతుంటాయి.

గతంలో ఇలా...

- చీపురుపల్లి అసెంబ్లీకి 1972లో జరిగిన ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ నుంచి రౌతు పైడపునాయుడు విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలోని 287 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ 219 స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- 1978లో జరిగిన ఎన్నికల్లో భారత జాతీయ కాంగ్రెస్ (ఐ) పార్టీ తరపున చిగిలపల్లి శ్యామలరావు గెలుపొందారు. 294 సీట్లకు గాను 175 స్థానాలను కైవసం చేసుకున్న కాంగ్రెస్ (ఐ) మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- 1983లో జరిగిన సాధారణ ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి త్రిపురాన వెంకటరత్నం తెలుగుదేశం పార్టీ తరపున గెలిచారు. రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించి 294కి గాను 202 స్థానాల్లో విజయ ఢంకా మోగించిన తెలుగుదేశం పార్టీ.. ఎన్టీ రామారావు నేతృత్వంలో రాష్ట్రంలో అధికారం చేపట్టింది.
- 1985లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి కెంబూరి రామ్మోహనరావు గెలిచారు. అప్పుడు కూడా రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైంది. ఎన్టీ రామారావు రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు.
- 1989లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి టంకాల సరస్వతమ్మ విజయం సాధించినప్పటికీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యింది. ఆ ఎన్నికల్లో 294కి 181 సీట్లు గెలుచుకున్న ఆ పార్టీ మర్రి చెన్నారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. సెంట్‌మెంట్‌కు చిన్న విరామమిచ్చింది.
- 1994లో తెలుగుదేశం పార్టీ తరపున గద్దే బాబూరావు గెలుపొందారు. రాష్ట్రంలో 216 సీట్లు సాధించిన ఎన్టీఆర్ సీఎం అయ్యారు.
- 1999లో కూడా దేశం పార్టీ తరపున గద్దే బాబూరావు రెండోసారి గెలిచారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటయ్యింది.
- 2004, 2009లో ఇక్కడ బొత్స సత్యనారాయణ కాంగ్రెస్ తరపున గెలిచారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.
- 2014లో చీపురుపల్లి నుంచి కిమిడి మృణాళిని పోటీ చేసి, బొత్స సత్యనారాయణపై విజయం సాధించారు. రాష్ట్రంలో ఆ పార్టీకి 117 సీట్లు లభించగా.. నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.
- 2019లో ఇక్కడి నుంచి వైసీపీ నుంచి బొత్స పోటీ చేసి గెలుపొందారు. 151 సీట్లు కైవసం చేసుకున్న ఆ పార్టీ వైఎస్ జగన్‌మోహనరెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ విధంగా గడిచిన ఐదు దశాబ్దాలుగా చీపురుపల్లిలో గెలిచిన పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుండడంతో.. ఇక్కడ అభ్యర్థుల విజయం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.



కిమిడి మృణాళిని



కెంబూరి రామ్మోహనరావు



గద్దే బాబూరావు



బొత్స సత్యనారాయణ



చీపురుపల్లి రైల్వే స్టేషన్

ఈవీఎం బటన్ నొక్కి.. బీప్ శబ్దం గమనించాలి

● ఓటు దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు పాటించండి

(గరుగుబిల్లి)

ఓటర్లు పోలింగ్ బూత్‌లో ఈవీఎం బటన్ నొక్కి..శబ్దాన్ని గమనించాలి. శబ్దం రాకుంటే ఓటు దుర్వినియోగమైనట్లు భావించవచ్చు. ఓటర్లు ఈవీఎం శబ్దంపై దృష్టి కేంద్రీకరించి... అనుమానం ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. రావడం లేదని కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటారు. పోలింగ్ బూత్‌లో ముగ్గురు అధికారులు ఉంటారు. మొదటి అధికారి మన వివరాలను పరిశీలించి ఒక స్లిప్ ఇస్తారు. రెండో అధికారి ఓటరు సంతకం తీసుకుంటారు. మూడో అధికారి ఓటరు చేతి వేలికి ఇంకు మార్కు వేస్తారు. ఈ అధికారి వద్దే ఈవీఎం మాస్టర్ కంట్రోల్ యూనిట్ ఉంటుంది. అది నొక్కినప్పుడే ఈవీఎం యాక్టివేట్ అవుతుంది. అప్పుడు ఓటరు పరదా చాటునున్న ఈవీఎంలో నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. బటన్ నొక్కినప్పుడు ఒక శబ్దం వస్తుంది. వెంటనే పక్కనే ఉన్న వీవీ ప్యాట్‌లో ఓటు వేసిన అభ్య ర్థి పేరు, పార్టీ వివరాలు కనిపిస్తాయి.. బటన్ నొక్కినప్పుడు శబ్దం రాకపోతే ఓటు పడలేదని అర్థం. మూడో అధికారి ఈవీఎం మానిటర్ కంట్రోల్ యూనిట్ యాక్టివేట్ చేయలేదని అర్థం చేసుకోవాలి. వెంటనే ప్రశ్నించాలి. ఇది కూడా రిగ్గింగ్‌లో ఒక భాగమే. వృద్ధులు, కొత్త ఓటర్లు ఇది గమనించకుండా పోలింగ్ బూత్ నుంచి వెళ్లిపోతారు. తరువాత బూత్‌లో ఉన్నవారు మన ఓటును దుర్వినియోగం చేస్తారు. వాళ్లకు నచ్చిన వారికి వేసుకుంటారు. ఓటు వేయడం మన హక్కు. దానిని జాగ్రత్తగా నిర్వర్తించాల్సిన బాధ్యత మనపై ఎంతగానో ఉంది. ఏమైనా తేడా గుర్తిస్తే మాక్‌పోల్ స్లిప్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలి.



స్థానిక సమస్యల సంగతేంటి?

- కొత్త హామీలు లేవు
- గత హామీల ప్రగతి ఏమిటో చెప్పలేదు
- మూతపడిన పరిశ్రమలు... కార్మికుల పరిస్థితి ఏమిటి?
- ఇదీ సీఎం 'సిద్ధం' సభ తీరు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/బొబ్బిలి

ముఖ్యమంత్రి హోదాలో.. అది కూడా ఎన్నికల ప్రచారం కోసం వస్తున్నారంటే స్థానికంగా అభివృద్ధి సాధించేందుకు ఏవైనా హామీలు ఇస్తారని సగటు ఓటరు ఆశించడం సహజం. కానీ బుధవారం సీఎం జగన్ చేపట్టిన సిద్ధం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో స్థానిక సమస్యల ప్రస్తావనే లేదు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు... పాదయాత్ర నాటి హామీలు... ముఖ్యమంత్రిగా ఇచ్చిన హామీలు... గత ఐదేళ్లలో అవి ఏ మేరకు నెరవేర్చారు? అనే ప్రస్తావనే లేదు. ఇదేదీ లేకుండా ప్రతిపక్షాలపై విరుచుకుపడేందుకే ఎక్కువ సమయం తీసుకున్నారు. ప్రతిపక్షాల పైన.. వారి ఎన్నికల హామీల పైన విమర్శలకే ఎక్కువ సమయం తీసుకున్నారు. వైసీపీ ప్రస్తుత ఎన్నికల హామీలు ఏమిటో ప్రస్తావించలేదు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తామని ప్రకటించారు. సంక్షేమ పథకాలకు బటన్ నొక్కిన అంశాన్నే మరీ మరీ చెప్పారు. కానీ ఈ ప్రాంతంలో ప్రజల సమస్యలు ఏమిటి? ఈ ప్రాంత అభివృద్ధికి స్థానికంగా ఉపయోగపడే వనరులు ఏమిటి? వాటిని ఎలా వినియోగించుకోవాలని అనుకుంటున్నారు? తాము చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతి ఏమిటి? అన్న విషయాలను కనీసం ప్రస్తావించలేదు.



ప్రచారంలో సీఎం జగన్

బిల్లులు చెల్లించక...

- బిల్లులు చెల్లించని కారణంగా విజయనగరం, మన్యం జిల్లాల పరిధిలో అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. చినబోగిలి-మక్కువ, మక్కువ-సాలూరు రోడ్ల విస్తరణ పనులు బిల్లులు కాక నిలిచిపోయాయి. ప్రజల రాకపోకల కోసం నరకయాతన అనుభవిస్తున్నారు. సీతానగరం-బొబ్బిలి మధ్య ప్రవహిస్తున్న సువర్ణముఖి నది వంతెన పనులు కూడా బిల్లులు చెల్లించని కారణంగానే నిలిచిపోయాయి.
- తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పెండింగ్ పిల్ల కాల్వ పనులు నిలిచాయి.
- గజపతినగరం బ్రాంచి కాల్వ పనులను ప్రభుత్వం ఒక్క అడుగు కూడా పూర్తి చేయలేదు.



పారాది వంతెన దుస్థితి



పరిశ్రమల ఊసేదీ?

బొబ్బిలి ప్రాంతంతో పాటు జిల్లాలో మూత పడిన ఫెర్రో పరిశ్రమల అంశాన్ని ప్రస్తావించలేదు. జూట్ పరిశ్రమల్లో పనిచేసి ఉపాధి కోల్పోయిన కార్మికుల ఊసే లేదు. కార్మిక దినోత్సవం రోజున కార్మిక సమస్యలను ప్రస్తావించకపోవటం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ విధానాల కారణంగానే పరిశ్రమలు మూతపడి... కార్మికులు ఉపాధి కోల్పోయారు. బొబ్బిలి ప్రాంతంలోని ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారాన్ని మూత వేయించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే. రైతుల చెరకు సరఫరా బకాయిల కోసం ఏకంగా కర్మాగారాన్నే మూత వేయించారు. బకాయిలు పూర్తిగా చెల్లించారా అంటే అదీ లేదు. కొంత మంది నాయకుల స్వార్థం కోసం ఫ్యాక్టరీ బలైందన్న విమర్శలున్నాయి. మరో వైపు రైతులు చెరకు పంటకు దూరమయ్యారు.

- తారకరామతీర్థ సాగర్ సాగునీటి ప్రాజెక్టు పనులు జరగటం లేదు. చిన్న సాగునీటి ప్రాజెక్టుల గురించి పట్టించుకోని పరిస్థితి. తోటపల్లి కుడి ప్రధాన కాల్వ పరిధిలో ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే శంబంగి హామీ ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు. బొబ్బిలి మండలంలోని చిన్న సాగునీటి వనరులు... కురుపాం మండలంలోని గుమ్మిడి గెడ్డ, కొమరాడ మండలంలోని వనకాబడి గెడ్డ, పార్వతీపురం మండలంలోని అడారుగెడ్డ, మక్కువ మండలంలో సురాపాడు, సాలూరు, రామభద్రపురం, గజపతినగరం, నెల్లిమర్ల మండలాల పరిధిలోని చిన్న సాగునీటి వనరులను వినియోగించుకునే మినీ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టలేదు. సీఎం ప్రసంగంలో వీటి ప్రస్తావన కూడా లేదు.

ఆషామాషీ అభ్యర్థులకు అడ్డుకట్ట

(చీపురుపల్లి)

ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా పది మందిలో గుర్తింపు పొందాలని కొంతమంది కోరుకుంటారు. అసెంబ్లీకి పోటీ చేస్తే సుమారు నాలుగైదు మండలాల్లోనూ... పార్లమెంటుకు పోటీ చేస్తే ఆ పరిధిలోని దాదాపు 30 మండలాల్లోనూ గుర్తింపు తెచ్చుకోవచ్చునని చాలామంది అనుకుంటారు. ఈ లక్ష్యంతోనే డిపాజిట్ చెల్లించి పోటీకి సిద్ధపడతారు. అటువంటి ఆషామాషీ పోటీదారులను నిలువరించడం కోసమే కేంద్ర ప్రభుత్వం డిపాజిట్ మొత్తాన్ని లోక్‌సభకు రూ.25 వేలకు, అసెంబ్లీకి రూ.10 వేలకు పెంచింది. డిపాజిట్ మొత్తాల పెంపునకు సంబంధించిన ప్రజాప్రాతినిధ్య చట్ట (సవరణ) బిల్లు 2009కి పార్లమెంటు ఆమోదం తెలిపింది. దీంతో ఈ సవరించిన మొత్తాలు అమలులోకి వచ్చాయి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ మొత్తంలో యాభై శాతం చెల్లిస్తే సరిపోతుంది.



ప్రచారానికి వడదెబ్బ

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నాయకులు, కార్యకర్తలకు ఇబ్బందులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), మే 1: ఇంట్లో ఏసీ.. బయటకు వెళితే కారులో ఏసీ.. ఇలా నిత్యం 'చల్లగా' ఉండే అభ్యర్థులు మండుటెండలో ఎన్నికల ప్రచారానికి వెళుతూ..చెమటలు కక్కుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందునుంచే జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. వడగాల్పులు తీవ్రంగా ఉన్నాయి. నోటిఫికేషన్ వెలువడిన దగ్గర నుంచి మరింత పెరిగాయి. ప్రచారంలో ముందుండాలనే ఉద్దేశంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో అభ్యర్థులు ఉదయం... సాయంత్రం ప్రచారం చేపట్టారు. రాను రాను సూర్యప్రతాపం ఎక్కువ కావటంతో కార్యకర్తలు ప్రచారానికి డుమ్మా కొడుతున్నారు. కొందరు అభ్యర్థులు... కార్యకర్తలు కూడా వడదెబ్బకు గురవుతున్నారు. ఎక్కువ సంఖ్యలో కార్యకర్తల మధ్య ప్రచారం చేయడం... హారతులు... పూలదండలు... నుదుటి తిలకం... ప్రచారంలో మంటలు పుటిస్తున్నాయి. కొంతమంది అభ్యర్థులు కార్యకర్తలు డీ-హైడ్రేషన్‌కు గురై.. సొమ్మసిల్లి పడిపోతున్న సందర్భాలు ఉంటున్నాయి. దీంతో చేసేది ఏమీ లేక... కొందరు అభ్యర్థులు ఉదయం 9 గంటలకే ప్రచారం ముగించుకుని... తిరిగి సాయంత్రం 5 గంటల తరువాత మొదలు పెడుతున్నారు. మే నెలలో ఉష్ణోగ్రతలు మరీ తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయినా ఈ 10 రోజులు ఎలాగైనా వీలున్నంత వరకు ఎక్కువ మంది ఓటర్లను కలుసుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఈ కొద్ది రోజులైనా సూరీడు కాస్త శాంతిస్తే బాగుండునని కోరుకుంటున్నారు. బుధవారం బొబ్బిలిలో జరిగిన సీఎం ఎన్నికల ప్రచారంలో కూడా అనేక మంది కార్యకర్తలు ఎండవేడిని, వడగాల్పులను తట్టుకోలేక సొమ్మసిల్లిపోయారు.



బొబ్బిలిలో సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలతో ఎండలోనే ప్రజలు



ఎండకు తాళలేక షాపుల నీడకు చేరిన దృశ్యం

భూ కబ్జాలు చేసేవారు నాయకులా?: అదితి



ప్రచారంలో భాగంగా కుండలను పరిశీలిస్తున్న అదితి

విజయనగరం రూరల్, మే 1: సెటిల్‌మెంట్లు, భూ కబ్జాలు చేసేవారు మనకు ప్రజాప్రతినిధులా? రానున్న ఎన్నికల్లో వీరు గెలిస్తే, ఇబ్బందికరమని, ప్రజలు ఆలోచించి ఓటేయాలని కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె నగరంలోని ఏడో డివిజన్‌లో పర్యటించారు. మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, నగర టీడీపీ అధ్యక్షుడు ప్రసాదుల ప్రసాద్, ఆ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పూసర్ల లక్ష్మి, సాయి రాజు ఆధ్వర్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన ఆమెకు స్థానికులు హారతులు పట్టారు. అనంతరం ఆమె దాసన్నపేట కుమ్మరవీధిలోని కుమ్మరి కులస్థుల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కోలగట్ల విజయనగరంలో సెటిల్‌మెంట్లు, భూ కబ్జాలు తదితర వాటిని ప్రోత్సహిస్తూ వచ్చారన్నారు. తనని, కలిశెట్టి అప్పలనాయుడుకి రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, టీడీపీ నాయకులు గంటా రవి, రౌతు పద్మ, దువ్వ రాము, గువ్వల చరణ్‌తో పాటు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో చక్కగా ఉందని కూటమి విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మేనిఫెస్టోకి సంబంధించిన కరపత్రా లను ఆవిష్కరించారు. అనంతరం టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు టీడీపీ నాయకులు పాలాభిషేకాలు నిర్వహించారు.

జగన్‌ను గద్దె దించటమే లక్ష్యం: కోండ్రు

రేగిడి: అరాచక పాలనచేస్తున్న సీఎం జగన్‌ను గద్దెదించటమే ప్రజల లక్ష్యంకావాలని, సీఎంగా చంద్రబాబును గెలిపించుకుంటేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని మాజీ మంత్రి, రాజాం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలో పెద్దశిర్లాం, ఉప్పునాయుడువలస, చాటాయివలస, వండానిపేట, కేఎంవలస, ఉంగరాడమెట్ట, గుల్లపాడు, లచ్చన్నవలస, తోకలవలస, లింగాలవలస, రెడ్డిపేట తదితర గ్రామాల్లో బుధవారం కోండ్రు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాన్ని దోచుకుతింటున్న జగన్ సర్కారుకి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ నేతలు దూబ దర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, గేదల బాలమురళీధర్, చల్ల భుజంగరావు, గురవాన ధనంజయ్‌రావు, కర్జేన మహేశ్వరరావు, కిమిడి నరేంద్రనాయుడు, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం సంతకవిటి మండలం పార్టీ సీనియర్ నాయకుడు కొళ్ల అప్పలనాయుడు పిలుపు మేరకు అప్పలఅగ్రహారం పంచాయతీ జానకీపురం, శేషాద్రిపురం గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాలు శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గట్టి భాను వల్లూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజాం మండలం నందబలగ. లక్ష్మీపురం. సోపేరు. గురవాం. కంచరాం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రేగిడి: వండానిపేట ప్రచారంలో మాట్లాడుతున్న కోండ్రు

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి: నాగమాధవి



నెల్లిమర్ల: కొండగుంపాంలో ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులతో నాగమాధవి

నెల్లిమర్ల: వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో చెల్లుచీటీ చెప్పాలని కూటమి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. మండలంలోని గరికిపేట, కొండగుంపాం గ్రామాల్లో ఆమె మంగళవారం రాత్రి కూటమి నాయకులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ పాలనా తీరుపై ప్రజలు విరక్తితో ఉన్నారని అన్నారు. ప్రతిఒక్కరూ గాజు గ్లాసు గుర్తుపై తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు, బూర్లె శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజకవర్గంలో అన్ని వనరులు ఉన్నా నేటి పాలకులు తగిన అభివృద్ధి చేయకపోవటం దురదృష్టకరమని కూటమి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. మండలంలోని పూసపాటిరేగ, కొవ్వాడ గ్రామాల్లో ఆమె బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తాను గెలిస్తే యువతకు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు మహంతి చిన్నంనాయుడు, పతివాడ తమ్మినాయుడు, మహంతి శంకరరావు, ఆకిరి ప్రసాదరావు, దంగా భూలోక, స్థానిక పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ పన్నింటి సన్యాశినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే సమస్యల పరిష్కారం: కలిశెట్టి



కొవ్వాడ గ్రామంలో ప్రచారం చేస్తున్న కలిశెట్టి

పూసపాటిరేగ, మే 1: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలన్నీ పరి ష్కారమవుతాయని కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని మత్స్యకార గ్రామమైన కొవ్వాడలో ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన లోకం నాగమాధవితో కలిసి ఆయన ప్రచారం చేశారు. గ్రామంలో వీరిని కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు గ్రామమంతా తిరిగి బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోపై ప్రచారం చేశారు. కూటమి అధికారంలోకి వస్తేనే సంక్షేమం, అభివృద్ధి రెండూ సాధ్యమవుతాయని తెలిపారు. మేనిఫెస్టోలో ఉన్న పథకాలన్నింటినీ చదివి వివరించారు. టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందని, పేదలంతా మళ్లీ సంక్షేమం పొందుదూ అభివృద్ధి బాట పడతారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. వైసీపీని ఇంటికి పంపించి, తమను గెలిపించేందుకు అమూల్యమైన ఓటును ఎంపీ అభ్యర్థి అభ్యర్థి కలిశెట్టికి సైకిల్ గుర్తుపైన, ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగ మాధవికి గాజు గ్లాసుపైన వేసి గెలిపించాలని కోరారు.

సంక్షేమం పేరుతో నిలువు దోపిడీ

శృంగవరపుకోట/రూరల్: సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలోని కుటుంబాలన్నింటినీ నిలువుదోపిడీ చేసిందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ పలు గిరిజన గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర నాయకు రాలు వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు ఆధ్వర్యంలో పర్యటించారు. ● శృంగవరపుకోట పట్టణంలోని మోపాడ వీధిలో కోళ్ల లలిత కుమారి కుమార్తె హసిత నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు విశాఖ టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ను గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి కోరారు. కోళ్ల భూపాల్ నాయుడు, కోణదం మల్లేశ్వర రావు, జి.లక్ష్మి తదితరులున్నారు.

రాక్షస పాలనకు ముగింపు పలకండి



జి. ములగాంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

చీపురుపల్లి: రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలనకు ప్రజలంతా ముగింపు పలకాలని చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు పిలుపునిచ్చారు. మండలంలోని గొల్లలములగాం, గొల్లలపాలెం, పుర్రేయవలస తదితర గ్రామాల్లో ఆయన బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, మహంతి అప్పలనాయుడు, శనపతి శ్రీనివాసరావు, గడే సన్యాసప్పలనాయుడు, గంట్యాడ సత్యన్నారాయణ, మీసాల నవీన్, గొర్లె లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి



టీడీపీలో చేరిన వారితో బేబీనాయన

బాడంగి: టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన అన్నారు. బుధవారం మండలంలోని బొత్సవానివలస, హరిజన పాల్తేరు, పాల్తేరు, అల్లువానివలస, భీమవరం, పూడివలస గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు తెంటు లక్ష్మం నాయుడు, పార్టీ ప్రెసిడెంట్ తెంటు రవి తదితరులున్నారు. ● **బొబ్బిలి:** బొబ్బిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, ఆయన సోదరుడు, మాజీ మంత్రి సుజయ్ కృష్ణరంగారావు, జనసేన నాయకులు గిరడ అప్పలస్వామి, పాలూరు బాబు, లంక రమేష్ తదితరులు బుధవారం స్థానిక 17వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

● మేమంతా ఎప్పుడూ టీడీపీ అభిమానులమేనని, మమ్మల్ని మభ్యపెట్టి ఇటీవల వైసీపీలో చేరినట్లు కండువాలువేసి ప్రకటించారని బాడంగి మండలం వాడాడ గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు తెలిపారు. బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడుల వద్దకు వచ్చి తాము ఎప్పుడూ తెలుగుదేశం పార్టీ మద్దతుదారులమేనని ప్రకటించారు. తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతున్నామని ప్రకటించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఏఎస్ఐ భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగిడి మండలం పోరాం గ్రామానికి చెందిన కోరుకొండ రాము(49) గత నెల 28న రాజాం నుంచి పాలకొండ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతని ముందు వెళ్తున్న ట్రాక్టర్ రాజాం మండలం గురువాం గ్రామ సమీపంలో ఒక్కసారిగా ఆగడంతో ట్రాక్టర్‌ను బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న రాము తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు రాజాంలో ప్రాథమిక చికిత్స అందించి అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ వివరించారు. మృతుడి భార్య మగతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్.ఐ. భాస్కరావు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

రాజాం: రాజాం ఎస్ఈబీ అధికారులు బుధవారం పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 134 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీధర్ తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో 53 మద్యం సీసాలు, వీఆర్ అగ్రహారంలో 30 సీసాలు, కంచరాం గ్రామంలో 51 సీసాలు స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో మాటుకాసి వారిని పట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనివాసురెడ్డి, చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

బాలకృష్ణ పర్యటనను విజయవంతం చేయండి

విజయనగరం రూరల్: సినీనటుడు, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎన్నికల ప్రచారం నిమిత్తం గురువారం విజయనగరం వస్తున్నారని, ఈ పర్యటనను నందమూరి అభిమానులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, చీపురుపల్లిలో ఎన్నికల ప్రచార సభ ముగించుకుని, సాయంత్రం 6 గంటలకు విజయనగరం చేరుకుంటారన్నారు. నందమూరి అభిమానులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆ అభిమాన సంఘం ప్రతినిధులు కాగిత శ్రీనివాస్ యాదవ్, కనకల మన్మథ, బంటుపల్లి రమేష్, రమణ తదితరులు పిలుపునిచ్చారు.

నేటి నుంచి సేవా కార్యక్రమాలు

విజయనగరం రింగురోడ్డు: డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి వేడుకల్లో భాగంగా మే నెల 2 నుంచి వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు నల్లపురాజు సత్యనారాయణ అన్నారు. సోమవారం క్షత్రియ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పీవీజీ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ అలాగే అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక సాయం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

వేసవి క్రీడా శిబిరం ప్రారంభం

శృంగవరపుకోట: శృంగవరపుకోట కేంబ్రిడ్జి నారాయణ పాఠశాలలో బుధవారం షటిల్ బ్యాడ్మింటన్ వేసవి క్రీడా శిబిరాన్ని ప్రారంభించారు. 7 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు వయసు గల 37మంది బాల, బాలికలు హజరయ్యారు. వీరికి నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామని చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

జామి: మీ గెలుపే ధ్యేయంగా లోట్లపల్లి గ్రామ జనసేన యువత పనిచేస్తుందని జనసైనికులు జన్నెల బాలకృష్ణ, ముగడ నరేష్ తదితరులు పేర్కొన్నారు. బుధవారం కూటమి అభ్యర్థి కేఏ శ్రీనివాస్‌ను కలిసి తమ ప్రచార ప్రణాళికలు వివరించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేగిడి: మండలంలో ఉంగరాడమెట్ట సబ్‌స్టేషన్ సంకిలి ఫీడర్‌లో ఉన్న తొమ్మిది గ్రామాల్లో విద్యుత్ నిర్వహణ చర్యల్లో భాగంగా ఈనెల 3న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక ఏఈ ఎల్ హరిబాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఈఫీడర్‌లో ఉన్న లక్ష్మీపురం, ఆడవరం, వన్నలి, చాటాయివలస, అక్కన్న అగ్రహారం, ఉప్పరనాయుడువలస, వండానిపేట, కేఎంవలస గ్రామాల్లో నిర్దేశిత సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పీవో, ఏపీవోలకు మలివిడత శిక్షణ

బొబ్బిలి: స్థానిక గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ హైస్కూల్లో బుధవారం పీవో, ఏపీవోలకు మలివిడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ పాల్గొని ఈవీఎంల వినియోగం, హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలకు సంబంధించి సమగ్రంగా అవగాహన కల్పించారు.

గజపతినగరం: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్వో ఎంవీ సూర్యకళ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈవీఎంలను ఏవిధంగా వినియోగించుకోవాలో సూచించారు.

శతశాతం వినియోగించుకోవాలి

నెల్లిమర్ల: సాధారణ ఎన్నికల్లో ప్రతిఒక్క ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డెంకాడ మండల హెచ్‌డీటీ కె.సూర్యకాంతం సూచించారు. బుధవారం స్థానిక రామతీర్థం జంక్షన్‌లో స్వీప్ ప్రచార కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీధి నాటిక, బుర్రకథల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు.

దళిత బంధు చంద్రబాబు

చీపురుపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు తన మేనిఫెస్టో ద్వారా దళిత బంధు అని మరోసారి నిరూపించుకున్నారని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం అన్నారు. కూటమి మేనిఫెస్టో విడుదలపై బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన ఎస్సీ నాయకులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పెందుర్తి సింహాచలం, సబ్బి సోనియా, చీడి రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

పూసపాటిరేగ: కనిమెళ్ల గ్రామంలో బుధవారం సుమారు 35 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు మహంతి చిన్నంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి శంకరరావు సమక్షంలో వీరంతా తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ నాయకులు సూర్యనారాయణరాజు, సూర్యారావు, ఆకిరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. ● **రాజాం:** నియోజకవర్గ పరిధిలో రేగిడి మండలం దేవుదల గ్రామానికి చెందిన 80 కుటుంబాలు, బూరాడ గ్రామానికి చెందిన 5 కుటుంబాలు బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ పార్టీలోకి ఆహ్వానించారు. వంగర మండలం పటువర్ధనం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ప్రొఫెసర్ తెంటు కాశినాయుడు కూడా టీడీపీలో చేరారు.

కోండ్రును కలిసి శిష్టకరణ సంఘ సభ్యులు

రాజాం: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్‌ను శిష్టకరణాల సభ్యులు బుధవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో పూర్తి మద్దతును ఇస్తామని సంఘం మాజీ అధ్యక్షుడు వంతరాం ఈశ్వరరావు, మాజీ కార్యదర్శి అల్లెన మురళీకృష్ణ, లీగల్ సెల్ సభ్యులు కాకరవలస కొండలరావు, సహాయ కార్యదర్శి, ఏపీ శ్రీను, వంద్రంగి తిరుమలరావు, బలివాడ షణ్ముఖపట్నాయక్, కొట్టు శంకరరావు, కాకరవలస పాండురంగ తదితరులు పాల్గొని శిష్ట కరణాలు తరుపున మద్దతిస్తామని తెలి పారు.

వేసవిలో బోధన తరగతులు నిర్వహించొద్దు

రాజాం: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వేసవి లో ఎటువంటి తరగతులు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని ఎంఈవో పినిపే ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి తరగతులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్ర మించిన వారికి నోటీసులు జారీ చేయడమే కాకుండా పాఠశాల అనుమతులు రద్దు చేస్తామన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రాజాం: స్థానిక సన్ రైజ్ ఆసుపత్రిలో బుధవారం ఫైర్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు ఏవిధంగా తీసుకోవాలి అన్న విషయంపై స్టేషన్ ఫైర్ అధికారి జనార్దనరావు అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో ఉన్న ఫైర్ ఎక్విప్‌మెంట్‌ను ఏవిధంగా వినియోగించాలనే అనే అంశంపై సిబ్బందితో కలిసి వివరించారు.

మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు



చంద్రబాబు, పవన్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాగార్జున

చీపురుపల్లి: ఎన్డీయే కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోతో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం చీపురుపల్లిలోని తన నివాసం వద్ద టీడీపీ, జనసేన అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. పార్టీ నాయకులు ముల్లు రమణ, రెడ్డి లక్ష్మణరావు, దాసరి శివప్రసాద్, రేగిడి వాసు, దివాకర్, బూడి శ్రీను, సూర్యనారాయణ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాం: చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లకు బుధవారం రాత్రి తెలగ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర నాయకులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు ఆధ్వర్యంలో పాల అభిషేకం నిర్వహించారు. మేనిఫెస్టోలో కాపులకు ప్రాధాన్యం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని సూర్యప్రకాష్‌రావు అన్నారు.

ఓటు చాలా విలువైనది



గిరిజన గ్రామంలో పర్యటిస్తున్న పరిశీలకులు

గంట్యాడ: ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, దీనిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు హనీస్ చాబ్రా పిలుపునిచ్చారు. మండలంలోని తాటిపూడి రిజర్వాయర్ ఆవలగల డీకే పర్తి గిరిజన గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. అక్కడ గిరిజనులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం గిరిజనులకు ఓటర్ బుక్‌కు పంపిణీ చేశారు. మరో పరిశీలకుడు సచ్చింద్ర పాటిల్, లైజింగ్ అధికారి వ్యవసాయ శాఖ జేడీ రామారావు ఉన్నారు.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

● ఘనంగా కార్మిక దినోత్సవం



రామభద్రపురంలో కార్మికదినోత్సవ నినాదాలు చేస్తున్న దృశ్యం

గజపతినగరం: పోరాటాలతోనే కార్మికుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు అన్నారు. బుధవారం మేడే దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ● **విజయనగరం దాసన్నపేట:** మోదీ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతామని ఎఐఎఫ్‌టీయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెహరా శంకరరావు పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా నగరంలోని పలు ఆటో స్టాండ్‌లలో జెండాలు ఎగురవేశారు. ● **జామి:** మండలంలోని జామి గ్రామంలో వాసవీసంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కుటుంబాలు కార్మికులకు బుధవారం మజ్జిగ పంపిణీచేశారు.

● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట పట్టణంలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. పాతబస్టాండ్ అవరణలోని కార్యాలయం వద్ద ఈ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు జెండా ఆవిష్కరించారు. ● **రాజాం రూరల్:** దోపిడీ లేని సమాజం కోసం కార్మిక హక్కుల దినోత్సవం స్ఫూర్తితో పోరాడాలని సీటు జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా బుధవారం రాజాంలో నిర్వహించిన ఉద్యోగ, కార్మిక, కర్షక, మేడే ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఇక్కడి పాత బస్టాండ్ ఆధ్వర్యంలో ఏఐటీయుసి ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ● **బొబ్బిలి:** పట్టణ కళాసీసంఘం కార్యాలయంలో సీనియర్ కార్మిక నేత జోగాది అప్పలస్వామి ఆధ్వర్యంలో, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పొట్నూరు శంకరరావు ఆధ్వర్యంలో, స్థానిక చినబజారు సెంటరు, జెండా మహల్ సెంటరులో ఏఐటీయూసీ నాయకుడు మునకాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. స్థానిక గంటి ప్రసాదం స్మారకభవనంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య అధ్యక్షుడు తమటాల అప్పలనాయుడు, నల్లి తవిటినాయుడు, దాసరి వెంకటరమణ తదితరుల ఆధ్వర్యంలో, ఇఫ్టూ కార్యాలయంలో, యూటీఎఫ్ నేత కె.విజయగౌరి ఆధ్వర్యంలో, సీఐటీయూ ఆధ్వర్యంలో, రావువారివీధి, సంగివీధిలో అంగన్వాడీ, ఆశా యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో మే డే వేడుకలను నిర్వహించారు. ● **నెల్లిమర్ల:** నగర పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయాస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ మండల నాయకుడు కె.రామారావు జెండా ఆవిష్కరించారు. ● **రామభద్రపురం:** కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలుచేసి కార్మికుల హక్కులను కాపాడాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీనివాసరావు కోరారు. మేడే సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం ఎర్ర జెండాను ఎగురవేశారు.